

ఇంధనం గుట్టు..పట్టేదెట్టా?

పెట్రోల్ నాణ్యత.. కొలతల్లో తేడా.. కల్తీ తదితర కారణాలతో వినియోగదారులు మోసపోతున్నారు.

- 8లో



అయ్యా.. స్పందించండి!

అయ్యా.. చాలా దూరం నుంచి వస్తున్నాం.. మా సమస్యలపై స్పందించండి అని జనం గ్రీవెన్స్‌లో మొరపెట్టుకున్నారు.

- 8లో



న్యూస్‌రీల్

పది పరీక్షలకు 214 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన పదో తరగతి గణితం పబ్లిక్ పరీక్షకు 214 మంది గైర్హాజరయ్యారని డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని 118 పరీక్ష కేంద్రాల్లో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 21,080 మంది హాజరుకావాల్సి ఉండగా 20,866 మంది హాజరయ్యారన్నారు. 214 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. డీఈఓ 2, ఫ్లయింగ్ స్క్వాడ్ 15 మంది, 18 కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్‌లు 65 పరీక్ష కేంద్రాల్లో విధులు నిర్వహించారని డీఈఓ తెలిపారు.

జెడ్పీలో కారుణ్య నియామకాలు



నియామక పత్రాలను ఇస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ రవికుమార్‌నాయుడు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాపరిషత్ పరిధిలో పలువురికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చారు. సోమవారం జెడ్పీ కార్యాలయంలో చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ రవికుమార్‌నాయుడు సంబంధిత పత్రాలను అందజేశారు. మొత్తం ఏడుగురికి జూనియర్ సహాయకులుగా బాధ్యతలు అప్పగించారు. వీరు త్వరలో విధుల్లో చేరనున్నారు. జిల్లాలో కారుణ్య నియమాకాల కింద ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

విచారించి.. న్యాయం చేయండి



ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదు, సమస్యపై క్షేత్రస్థాయిలో విచారించి, న్యాయం చేయాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ అధికారులను ఆదేశించారు. చిత్తూరు నగరంలోని ఏఆర్ పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పలు ఫిర్యాదులపై ఆయా పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్లతో వీడియో సమావేశంలో మాట్లాడి, సూచనలు చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు..కుటుంబ తగాదాలు, ఆర్థిక అంశాలు, మోసాలు, వేధింపులు, భూ తగాదాలకు సంబంధించిన 45 ఫిర్యాదులు ఎస్పీకి అందజేశారు. ఈ గ్రీవెన్స్‌లో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీటీసీ డీఎస్పీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భూమాతకు గర్భశోకం వచ్చింది. ఈ ఏడు భానుడి ప్రతాపంతో ఆ తల్లి కడుపులో దాచుకున్న జలమట్టం రోజురోజుకూ దారుణంగా పడిపోతోంది. వెరసి.. కుంటలు, చెరువులు, బావులు, బోరు బావుల్లో నీళ్లు అడుగంటిపోయాయి. భూతలం మొత్తం ఎడారిని తలపిస్తోంది. ఫలితం జిల్లాలో కన్నీటి గడియలు ముంచుకొస్తున్నాయి. నీటి కోసం జనం నీరసించిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. వేసవి ప్రారంభంలోనే జిల్లాకు దుర్భిక్షం పరిచయం అయ్యింది. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే నీటి కోసం చుక్కలు చూడాల్సి వస్తోంది.

– చిత్తూరు కలెక్టరేట్



కన్నీటి ఘడియలు

జిల్లాలో ముంచుకొస్తున్న జలముప్పు

- జిల్లాలో వేగంగా అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఎండిపోతున్న చెరువులు, బావులు, కుంటలు
- యంత్రాంగం అప్రమత్తత అవసరం

వేసవి ప్రారంభంలోనే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఒక వైపు ఎండ తీవ్రత, మరోవైపు వేడి గాలుల దాటికి నీరు ఆవిరవుతోంది. గత ఏడాది వర్షపాతం అంతంత మాత్రంగానే నమోదు కావడం..దానికి తోడు చెరువులు, కుంటల్లో జలాలు కూడా లేకపోవడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోంది. జిల్లాలోని పలు మండలాల్లో రోజురోజుకు భూగర్భజలమట్టం పాతాళంలోకి చేరుతోంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా జిల్లాలో తాగు, సాగునీటికి సమస్యలు ఏర్పడే పరిస్థితులు నెలకొంటున్నాయి. జిల్లాలో 2024 నుంచి ఈ ఏడాది మార్చి వరకు సాధారణ వర్షపాతం 1099.96 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. అయితే పలు గ్రామాల్లో వేసవి ప్రారంభంలోనే నీటి ఎద్దడి సమస్యలు తలెత్తుతున్నట్లు రైతులు వాపోతున్నారు. కరెంట్ కోతలతో పాటు సాగునీటి వనరులు అడుగంటిపోవడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. వేసవి ప్రారంభంలోనే బోరుబావులు, చెరువులు, కుంటలు, వాగుల్లో జలధారాలు అడుగంటుక పోవడంతో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది.

11.05 మీటర్లకు పడిన సగటు నీటిమట్టం

జిల్లాలో రోజురోజుకు నీటిమట్టం పడిపోతోంది. ఫిబ్రవరి చివరి నాటికి జిల్లా సగటు భూగర్భ జలమట్టం 11.05 మీటర్లకు పడిపోయినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. జిల్లాలోని గుడుపల్లి, రామకుప్పం, వి.కోట, గంగవరం మండలాల్లో నీటిమట్టం అత్యధిక లోతుకు పడిపోతున్నట్లు తెలిసింది. ఇప్పటికే జిల్లాలో 38 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే ఏప్రిల్, మే నెలల్లో భూగర్భ జలాల పరిస్థితి ఎలా ఉంటుందోనని అన్నదాతలు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



భూగర్భ జలమట్టం పడిపోయిన మండలాల వివరాలివీ..

10 నుంచి 20 మీటర్ల లోపు నీటిమట్టం పడిపోయిన మండలాలు:	8
20 నుంచి 30 మీటర్ల లోతుకు పడిపోయినవి:	2
5 నుంచి 10 మీటర్ల లోతుకు పడిపోయినవి:	8

ప్రాజెక్టుల్లోనూ తగ్గుతోంది

చిత్తూరు జిల్లాలోని కృష్ణాపురం ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం 0.2 టీఎంసీకాగా ప్రస్తుతం 0.13 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఎన్టీఆర్ జలాశయం నీటి సామర్థ్యం 0.12 టీఎంసీలు కాగా 0.1 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. అలాగే కృష్ణాపురం ప్రాజెక్ట్‌లో 689.13, ఎన్టీఆర్ జలాశయంలో 965.14 అడుగుల లోతులో నీటి నిల్వలున్నట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఎండలు మండుతుండడంతో ఈ నీళ్లు ఎన్ని రోజులకు సరిపోతాయన్న ప్రశ్న జిల్లా ప్రజల్లో తలెత్తుతోంది.

వేసవి ప్రారంభంలోనే కష్టాలు

వేసవి ప్రారంభంలోనే నీటి కష్టాలు త ప్పడం లేదు. జిల్లాలోని పలు గ్రామాల్లో ఇప్పటికి చాలా గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికే కొన్ని గ్రామాలకు మంచినీటి సరఫరా కాకపోవడంతో ప్రజలు వ్యవసాయ బావులు, బోరు బావులపై ఆధారపడి కాలం వెళ్లదీస్తున్నారు. పలమనేరు నియోజకవర్గంలోని పలమనేరు, గంగవరం, వి.కోట, కుప్పం నియోజకవర్గం గుడుపల్లి, రామకుప్పం మండలాల్లోని కొన్ని గ్రామాల్లో కిలోమీటర్ల మేర ఖాళీ నడకన వెళ్లి నీటిని తెచ్చుకునే పరిస్థితులు నెలకొన్నాయి. మారుమూల గ్రామాలకు పైపులైన్ వేసినప్పటికీ నీటి కనెక్షన్ ఇచ్చే పనులు పూర్తి చేయకపోవడం, చిన్నపాటి మరమ్మతులు చేయకపోవడంతో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. చెరువులు, కుంటలు, వాగులపై ఆధారపడి సాగు చేసినా.. అడుగంటిపోవడంతో వరి, ఇతర పంటలు ఎండుముఖం పట్టే పరిస్థితి తలెత్తుతోంది. ప్రత్యామ్నాయ మార్గం లేక చేతికి వచ్చిన పంటను వదిలించుకోవాల్సిన పరిస్థితి వస్తుందేమోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశుగ్రాసం కొరతతో పాటు నీటిఎద్దడి ఏర్పడడంతో పశువులు అల్లాడుతున్నాయి.

ఈ మండలాల్లో ఉపశమనం

జిల్లాలోని చాడేపల్లిలో 1.72 మీటర్లు, నగరిలో 2.16, ఎస్ఆర్ పురంలో 3.54, తవణంపల్లెలో 1.99, వెదురుకుప్పంలో 3.71, పూతలపట్టు 2.94, కార్వేటినగరంలో 3.86 మీటర్ల లోతుల్లోనే భూగర్భ జలాలు అందుబాటులో ఉండడంతో అక్కడి ప్రజలకు ఉపశమనం కలిగింది. వేసవి ప్రారంభంలోనే భూగర్భజలాలు పడిపోతుండగా, ఏప్రిల్, మే నాటికి పరిస్థితి మరింత దిగజారవచ్చని నిపుణులు వెల్లడిస్తున్నారు.

జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితి ఇదీ..

జిల్లాలో తాజాగా జిల్లా భూగర్భ జలవనరుల శాఖ ఫిబ్రవరి నెలలో సేకరించిన వివరాల ప్రకారం.. జిల్లాలో సగటు లోతు 11.05 మీటర్లుగా నమోదైంది. జిల్లాలోని కుప్పం నియోజకవర్గం గుడుపల్లిలో 51.73 మీటర్ల లోతుకు నీటిమట్టం పడిపోవడం విస్మయానికి గురిచేస్తోంది. అలాగే గంగవరంలో 12.53, కుప్పంలో 17.59, పలమనేరులో 11.98, పుంగనూరులో 12.92, రామకుప్పంలో 16.71, శాంతిపురంలో 14.11, వి.కోటలో 22.18 మీటర్లతో అత్యధికంగా లోతుల్లోకి భూగర్భజలాలు పడిపోయాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే మీటర్ల లోతుల్లోకి నీటిమట్టం పడిపోయింది. 2024వ సంవత్సరం ఫిబ్రవరి లో జిల్లాలోని అన్ని మండలాల్లో నీటి మట్టం 10.56 ఉండగా అదే ఈ ఏడాది ఫిబ్రవరి లో 11.05 కి పడిపోయింది.

అత్యధిక నీటిమట్టం పడిపోయిన మండలాలు

మండలం	పడిపోయిన లోతు(మీటర్లు)
గుడుపల్లి:	51.73
వి.కోట:	22.18
కుప్పం:	17.59
రామకుప్పం:	16.71
శాంతిపురం:	14.11
పుంగనూరు:	12.92
గంగవరం:	12.53
పలమనేరు:	11.98

జిల్లాలో నీటి వనరుల సమాచారం

కాలువలు:	244
చెరువులు:	4,067
బావులు:	88,650
పెద్ద చెరువులు:	658
బోరుబావులు:	5,456
మొత్తం:	99,075

నీటి సంరక్షణ అందరి బాధ్యత



నీటి సంరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలి. నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి. అప్పుడే భావితరాలకు నీటి ఎద్దడి లేకుండా చేయవచ్చు. పశ్చిమ మండలాల్లో కొద్దిగా నీటి సమస్య ఇబ్బందిగానే ఉంది. తాగునీటి సమస్యలున్న గ్రామాల్లో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలి. భూగర్భజలాలను వృథా చేయకుండా వాడుకోవాలి. అర్బన్ ప్రాంతాల్లో నీటిమట్టాలు తగ్గిపోతున్నాయి. కొత్త భవనాల్లో రీచార్జి బిట్‌లను కచ్చితంగా కట్టాలనే ప్రభుత్వ నిబంధన ఉంది. అయితే చాలా చోట్ల ఆ నిబంధన అమలుకు నోచుకోవడం లేదు. పొలాల్లో నీటి గుంటలు, కందకాలను ఏర్పాటు చేసుకోవాలి.

– గోవర్ధన్‌రెడ్డి, జిల్లా భూగర్భ జలశాఖ అధికారి

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి



నగరం, పరిసర ప్రాంతాల్లో జనాభా పెరగడంతో భూగర్భ జలాల వినియోగం పెరిగింది. వర్షాలు అంతగా లేకపోవడంతో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగింది. దీంతో కొన్నిచోట్ల బాగా అడుగంటిపోయాయి. నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి ఇళ్లు, అపార్టుమెంట్ ఆవరణలో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయాలి. నీటి రీసైక్లింగ్ విధానం అమలు చేయాలి. నగర పరిసరాల్లో కొండలు చుట్టూ కందకాలు తవ్వాలి. డబ్బు మాదిరిగానే నీటి వినియోగంలో అంతే పొదుపు, జాగ్రత్తలు పాటించాలి.

– రవికుమార్‌నాయుడు, జెడ్పీ సీఈఓ, చిత్తూరు జిల్లా

సప్లయ్ చానళ్లను పూడ్చేస్తున్నారు!



సమస్యలు విన్నవిస్తున్న వి.కోట మండల ప్రజలు, నేతలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని పలు సమస్యలపై సోమవారం జెడ్పీలో చైర్మన్ శ్రీనివాసులుకు ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానికులు విన్నవించారు. ఇందులో భాగంగా వి.కోట మండలం మీదుగా బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఇందులో భాగంగా వి.కోట, పైపల్లి, పత్రపల్లి చెరువులకు వర్షపు నీరు వచ్చే సప్లయి చానళ్లను ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు పూడ్చేస్తున్నారని మొరపెట్టుకున్నారు. కర్ణాటక రాష్ట్రం ఎగువ ప్రాంతాల్లో చెరువులు నిండినా, వర్షాలు కురిసినప్పుడు మొరవ ద్వారా వి.కోట, పైపల్లి, పత్రపల్లి చెరువులకు నీరు చేరుతుందన్నారు. ఈ నీటి ద్వారానే ఈ మూడు గ్రామాల ప్రజలకు సాగు, తాగునీరు అందుతోందన్నారు. అయితే ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు కాలువను పూడ్చి దానిపైన రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. అనంతరం మీడియాకు సమస్యను తెలిపారు. చిత్తూరు రూరల్ మండలంలో బోరు, పంపుసెట్ మంజూరు చేయాలని జెడ్పీటీసీ బాబునాయుడు విన్నవించారు. తుమ్మింద పంచాయతీ అడవిచేనులోని మర్రిమాను ఇండ్లు వద్ద 30 కుటుంబాలు ఉన్నాయన్నారు. వీరు నీటి సదుపాయం లేక అవస్థ పడుతున్నారని చెప్పారు. వ్యవసాయబావిలో నీరు తెచ్చుకుని అవస్థలు పడుతున్నారన్నారు. నీటి సమస్యను పరిష్కరించి కొత్త బోరు, పంపుసెట్ మంజూరు చేయాలన్నారు. సప్లయ్‌చానళ్ల సమస్యను కలెక్టర్‌కు నేరుగా కలిసి తెలియజేస్తానని చైర్మన్ తెలిపారు. నీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశిస్తామని వివరించారు.

సైబర్ క్రైమ్ బాధితుడి సత్వర న్యాయం

యాదమరి/చిత్తూరు అర్బన్: సైబర్ క్రైమ్‌నకు గురైన బాధితులు తక్షణం స్పందించి, పోలీసులకు సమాచారం ఇస్తే.. సత్వర న్యాయం జరుగుతుందని చిత్తూరు ఎస్పీ మణికంఠ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారు. దీని అర్థం ఎలాంటిదో ఈ ఘటనే నిదర్శనం. యాదమరి మండలానికి చెందిన ఓ వ్యక్తికి ఈనెల 20వ తేదీన రాత్రి 10.40 గంటల ప్రాంతంలో రెండుమార్లు ఓటీపీ మెసేజ్ వచ్చింది. మొదటిగా రూ.1,12,900, రెండోసారి రూ.23 వేలు తన ఖాతా నుంచి ఖర్చయినట్లు సారాంశం. కొద్దిసేపు ఆలోచించిన వ్యక్తి, తాను ఆన్‌లైన్‌లో ఏదీ కొనుగోలుచేయలేదని నిర్ధారించుకున్న తరువాత రాత్రి 10.50 గంటలకు యాదమరి ఎస్ఐ ఈశ్వర్‌కు, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టర్ (ఎన్‌సీఆర్‌పీ) వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. ఆదివారం సంబంధిత వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి సైబర్‌క్రైమ్ ద్వారా దొంగిలించిన మొత్తం కూడా అతని ఖాతాలో జమ చేసేలా చేశారు. మోసం జరిగినప్పుడు బాధితులు వెంటనే ఫోన్–1930, పోలీసు వాట్సప్–9440900005 నంబర్లకు సమాచారం ఇస్తే, త్వరగా చర్యలు తీసుకుని డబ్బులు తెప్పించే ప్రయత్నం చేస్తామని ఎస్పీ తెలిపారు.

కార్యదర్శులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌లో సీఈఓ రవికుమార్ నాయుడు, డీపీఓ సుధాకర్‌రావు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో పంచాయతీ కార్యదర్శులకు బదిలీలపై సోమవారం కౌన్సెల్సింగ్ నిర్వహించారు. జెడ్పీ సమావేశ మందిరంలో సీఈఓ రవికుమార్‌నాయుడు, డీపీఓ సుధాకర్‌రావు ప్రక్రియను నిర్వహించారు. గ్రేడ్ 5 నుంచి గ్రేడ్ 4కు పదోన్నతి పొందిన కార్యదర్శులు ఆప్షన్ పెట్టుకున్నారు. మొత్తం 83 మంది బదిలీలకు అర్హత సాధించగా అందులో 77 మంది వారు కోరుకున్న స్థానాలను తెలియజేశారు. సంబంధిత పత్రాలను అధికారులు పరిశీలించారు. ఈ నివేదికను ఆమోదం కోసం కలెక్టర్‌కు పంపుతామన్నారు. ప్రక్రియ పూర్తయిన తర్వాత ఉద్యోగోన్నతులు, బదిలీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఖాళీల భర్తీలను ప్రభుత్వ ఆమోదంతో ఉద్యోగోన్నతి ద్వారా చేపడతామన్నారు.

శతాబ్దాల ఉత్సవం

పురజనుల ఉత్సాహం

శతాబ్దాలుగా సాగుతున్న ఉత్సవం..కుల మతాలకతీతం..చిన్నా పెద్దా లేడా లేకుండా పురజనులకు ఉత్సాహం.. జమిందార్ల ఆధ్వర్యంలో నిర్వహించే జాతర వైభవం.. అదే ఆరోగ్యప్రదాయిని.. భక్తుల పాలిట కల్పవల్లి.. సుగుటూరు గంగమ్మ తల్లి జాతర. ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే ఈ పండుగపై కథనం.

- నేటి నుంచి శ్రీసుగుటూరు గంగమ్మ జాతర

పుంగనూరు శ్రీ సుగుటూరు గంగమ్మ



పుంగనూరులో జాతరకు ముస్తాబైన జమీందారుల ప్యాలెస్



పుంగనూరు: పరశురామ క్షేత్రంగా ఆవిర్భవించి.. పుంగపురిగా మారి..కాలక్రమేణ పుంగనూరుగా రూపాంతరం చెందింది ఈ పట్టణం. గౌని వంశానికి చెందిన ఇమ్మడి తిమ్మరాయల సంతతే పుంగనూరు జమిందార్లు అని చరిత్ర చెబుతోంది. నాటి జమిందార్లు 18వ శతాబ్దం పూర్వార్థంలో ప్రారంభించిన సుగుటూరు గంగమ్మ జాతర నేటికీ ఏటా వారి వంశస్తుల ఆధ్వర్యంలోనే జరుగుతోంది. ఆరోగ్య ప్రదాయినిగా, భక్తుల పాలిట కల్పవల్లి పేరొందిన సుగుటూరు గంగమ్మ జాతర హోలీ తరువాత జిల్లాలో జరిగే అతి పెద్ద జాతరగా పేరుగాంచింది. పుంగనూరులో కులమతాలకతీతంగా సుమారు ఎనిమిది శతాబ్దాలుగా జమీందారు ల కులదైవమైన శ్రీ సుగుటూరు గంగమ్మ జాతరలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారికి జమీందారి కుటుంబీకులు రాజ సోమశేఖర్ చిక్కరాయుల్, రాజా మల్లికార్జున చిక్కరాయల్, వారి కుటుంబీకులు ప్యాలెస్‌లో తొలి పూజలు చేయనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్వర్ణమ్మ దంపతులు, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. అనంతరం అమ్మవారిని ప్యాలెస్ నుంచి తీసుకొచ్చి, పురవీధుల్లో ఊరేగిస్తారు. వేలాది మంది భక్తులు హాజరై, ఊరేగింపులో అమ్మవారికి జంతు బలులు సమర్పించి, మొక్కులు చెల్లించుకుంటారు. బుధవారం ఉదయం అమ్మవారిని ప్యాలెస్ ఆవరణలోని ఆలయంలో కొలువు దీర్చి, వేకువజామున జమీందారి కుటుంబీకులు తొలిపూజలు నిర్వహించి, భక్తుల దర్శనానికి అనుమతిస్తారు. అదే రోజు రాత్రి అమ్మవారిని నిమజ్జనం చేస్తారు. ప్యాలెస్ ఆవరణలో జమీందారుల ఆధ్వర్యంలో మంగళవారం గొర్రెల సంత నిర్వహిస్తారు.

ఏర్పాట్లు

ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే జాతరకు కర్ణాటక, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు రానున్నారు. కాగా జాతరలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, చైర్మన్ అలీమ్‌బాషా, పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. చలివేంద్రాలు, వైద్యశిబిరాలు, విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు, ఆలయ ప్రాంగణంలో బ్యారికేడ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



జాతర గురించి చర్చిస్తున్న జిల్లా ఎస్పీ

పుంగనూరులో జరుగుతున్న శ్రీసుగుటూరు గంగమ్మ జాతర ఏర్పాట్లను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. సోమవారం రాత్రి ఆయన పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్‌తో కలసి ప్యాలెస్ లోకి వెళ్లారు. అక్కడ జమీందారి కుటుంబీకులను కలసి అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనం కార్యక్రమాలపై చర్చించారు. ప్యాలెస్‌లో భక్తుల రద్దీ లేకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. రద్దీ సమయంలో చైన్ స్నాచర్లు, జేబు దొంగల కట్టడితో పాటు అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీసులు గస్తీ ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయన వెంట ఎస్బీ సీఐ భాస్కర్, సీఐలు రామ్‌భూపాల్, ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నేనేమన్నా.. పోలీసులనంతా మార్చమన్నానా!

- జిల్లాలో 264 మందిని మార్చి ఆ నెపం నాపైకేస్తే ఎట్లా?
- పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి

పలమనేరు: తాను పుంగనూరులో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్న పోలీసులను మార్చమంటే జిల్లాలోని 264 మందిని మార్చమన్నానా? అని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పలమనేరులని టీడీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'నా వల్ల జిల్లాలోని పోలీసులను బదిలీ చేశారనుకుని, వారి కుటుంబ సభ్యుల తిట్లు నాకు అవసరమా. మేము అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతాంది. మాకు అనుకూలంగా ఉన్న వారిని వేయమన్నాను. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ నాయకులు వారికి అనుకూలంగా ఉన్న పోలీసులను వేయించుకోవడం సాధారణ విషయమే. రాజకీయ పార్టీలు ఐదేళ్లుంటాయి, మళ్లీ వేరే పార్టీ రావచ్చు కానీ అధికారులు మాత్రం శాశ్వతంగా ఉంటారు. నేను ఈ ప్లగ్ తీసి ఆ ప్లగ్ పెట్టబ్బా కరెంట్ ఇక్కడ మలగాలి కదా? అంటే ఎక్కడో తమిళనాడు బోర్డర్‌లో ఉండే ప్లగ్‌లో పెట్టమన్నానా?. జిల్లాలో 264 మందిని మార్చి ఆ నెపం నాపై కేస్తే ఎట్లబ్బా' అని జిల్లా ఎస్పీనుద్దేశించి మాట్లాడారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి

క్లుప్తంగా

కోళ్లఫామ్ గోడౌన్‌కు నిప్పు



గోడౌన్‌లో కాలిపోయిన సామగ్రి


పులిచెర్ల(కల్లూరు): మండలంలోని 106 రామిరెడ్డి గారిపల్లె పంచాయతీ చెరువు ముంద రపల్లెకు చెందిన నాగిరెడ్డి కోళ్ల ఫామ్ గోడౌన్‌కు ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో గోడౌన్‌లోని 15లక్షలు విలువ చేసే ఆటోమెటిక్ ఫీడింగ్ మిషన్, మోటరు, ఫీడర్లు, ప్లాస్టిక్ సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. దీనిపై కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అధికారులు వచ్చి పరిశీలించారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డీశ్వరరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్ బాషా గోడౌన్‌ను పరిశీలించారు.

ఉచిత ఆన్‌లైన్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో డీఎస్సీకి సన్నద్ధం అవుతున్న బీసీ, ఈడబ్ల్యూసీ అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఆన్‌లైన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మెగా డీఎస్సీ 2025 పరీక్షకు సిద్ధం అవుతున్న బీసీ, ఈడబ్ల్యూసీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ శిక్షణను ఉచితంగా అందిస్తోందన్నారు. బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి చెంది టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు కుల, జనన, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు టెట్ ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 9177429494 నంబర్‌లో సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

ఒకే మీడియంలో గణిత ప్రశ్నపత్రం

- పది పరీక్షల నిర్వహణలో సర్కారు అలసత్వం



ఇంగ్లిష్‌లో మాత్రమే గణిత ప్రశ్నపత్రం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం పదోతరగతి గణితం పరీక్ష నిర్వహించారు. అయితే ఒకే మీడియంలో ప్రశ్నపత్రం ఇవ్వడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులకు ఇంగ్లిష్ అర్థం అయ్యేందుకు గత వైఎస్సార్‌సీపీ సర్కారు బైలింగ్వల్ విధానం ప్రవేశపెట్టింది. ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. ఈ విద్యాసంవత్సరంలో పదో తరగతి విద్యార్థులకు బైలింగ్వల్ విధానంలోనే (ఒక వైపు తెలుగు, మరో వైపు ఇంగ్లీష్) పాఠ్య పుస్తకాలు ఇచ్చారు. అలాగే పాఠశాల స్థాయిలో నిర్వహించిన ప్రీ ఫైనల్స్, గ్రాండ్ టెస్ట్ ప్రశ్నపత్రాలు సైతం బైలింగ్వల్‌లోనే అందించారు. అయితే పబ్లిక్ పరీక్షలకు వచ్చే సరికి గణితం ప్రశ్నపత్రం మాత్రం ఒకే లాంగ్వేజ్‌లో ముద్రించారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తికమకపడి అవస్థలు ఎదుర్కొన్నారు. కీలకమైన పరీక్షలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

'పెట్రోల్ తక్కువ ధరకేమీ ఇవ్వడంలేదు. లీటరుకు రూ.వందకు పైనే వసూలు చేస్తున్నారు. తక్కువ పెట్రోలు పోయడం, కిరోసిన్ కలపడంతో వినియోగదారులు తీవ్రంగా మోసపోతున్నారు. అధికారులు నామమాత్రపు తనిఖీలు చేసి జరిమానాలతో సరిపెడుతున్నారు. మోసాలకు పాల్పడే పెట్రోలు బంకుల లైసెన్సులు రద్దు చేసి, చట్టరీత్యా చర్యలు తీసుకోండి.' – రాష్ట్ర హైకోర్టు

'80 శాతం పెట్రోలు బంకుల్లో అసలు నాణ్యత ఉండదంలేదు. ఏది అసలో, ఏది కల్తీనో తెలియదంలేదు. నాణ్యత పరీక్షించడానికి ఫిల్టర్ పేపర్ అడిగితే, అంటే ఏమిటంటున్నారు. అత్యవసర వేళ కాలకృత్యం తీర్చుకోవాలంటే కనీసం వాష్ రూమ్ కనిపించదు. అధికారులు ఏటా ఓసారి వచ్చి తనిఖీ చేసి, రూ.2 వేలు జరిమానా విధించి చేతులు దులుపుకుంటున్నారు.' – జిల్లాలో పెట్రోలు బంకుల పరిస్థితి

ఇంధనం గుట్టు.. పట్టేదెట్టా?

పెట్రోల్‌లో నాణ్యతలో తేడా.. కొలతల్లో వ్యత్యాసం.. బంకుల్లో కనీస వసతులు లేమి.. తదితర కారణాలతో వినియోగదారులు మోసపోతున్నారు. బంకు యజమానులు పెట్రోల్ పంపుల్లో సాంకేతి పరిజ్ఞానం, చిప్‌లను వినియోగించి నిలువునా దోచేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారు. మరి ఈ మోసాలు పట్టేదెలా అని సామాన్యులు చింతిస్తున్నారు.

- ఏది అసలు.. ఏది కల్తీ తెలియని వైనం
- నాణ్యత నిర్ధారణకు బంకుల్లో వస్తువుల్లేవు
- వసతులు.. కనీస సౌకర్యాలు కనిపించవు
- అధికారుల తనిఖీలు నామమాత్రమే
- 'సాక్షి' పరిశీలనలో వెలుగులోకి వాస్తవాలు



చిత్తూరు హైరోడ్డులో వసతుల్లేని ఓ పెట్రోలు బంకు

చిత్తూరు అర్బన్: కొన్ని పెట్రోలు బంకుల్లో జరుగుతున్న మోసాలపై రాష్ట్ర హైకోర్టు ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. జరిమానాలతో వాటిని సరిచేయొద్దని కూడా ఘాటుగా వ్యాఖ్యానించింది. అయితే పెట్రోలు బంకుల్లో అసలు ఏం జరుగుతోంది..? ఇక్కడ లభ్యమవుతున్న పెట్రోలు నాణ్యత పరిస్థితి..? వాహన చోదకులకు ఎలాంటి సౌకర్యాలు బంకుల వద్ద లభించాలి..? వీటిపై పర్య వేక్షణ పెట్టాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు..? అనే విషయాలను తెలుసుకోవడానికి జిల్లా వ్యాప్తంగా 'సాక్షి' బృందం పెట్రోలు బంకులను పరిశీలిస్తే పలు ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి.

కల్తీ గుర్తించే వీల్లేదు..

పెట్రోలు నాణ్యతను నిర్ధారించేదే ఫిల్టర్ పేపర్ పరీక్ష. బంకుల నిర్వాహకుల వద్ద తప్పనిసరిగా ఫిల్టర్ పేపర్ ఉండాలి. నాణ్యతపై అనుమానం వస్తే..ఓ ఫిల్టర్ పేపర్ తీసుకుని దానిపై నాలుగు చుక్కల పెట్రోలు పోయాలి. నిమిషం తరువాత పేపర్‌పై ఎలాంటి మరక కనిపించకపోతే అది నాణ్యమైనది. ఏదైనా మరక ఏర్పడితే అందులో కల్తీ జరిగిందని గుర్తించాలి. పెనుమూరు, గంగాధరనెల్లూరు, వి.కోట, శాంతిపురం, గుడిపాల, యాదమరి, చిత్తూరులోని పలు పెట్రోలు బంకుల్లో ఫిల్టర్ పేపర్ లేదని చెబుతున్నారు. ఇలా జిల్లాలోని 67 పెట్రోలు బంకుల్లో అసలు ఫిల్టర్ పేపర్ అందుబాటులో లేదు. కొన్ని చోట్ల ఫిల్టర్ పేపర్ ఇస్తుంటే, మరి కొన్ని చోట్ల ఉన్నా కూడా ఇవ్వడం లేదు. ఇక పెట్రోలు నాణ్యత తెలుసుకోవడానికి పెట్రోలు పోసే పంపులను గమనిస్తే.. పెట్రోలు 720–775, డీజిల్ 820–345 మధ్యలో ఉంటేనే అది నాణ్యమైనదిగా అర్థం. చాలా చోట్ల లీటరు పెట్రోలు ధర, ఎంత పడుతున్నారనే విషయం తప్ప మరేమీ కనిపించడం లేదు. చిత్తూరు నగరంలోని హైరోడ్డులో ఉన్న బంకులో సాంద్రత రీడింగు ఏమాత్రం కనిపించడంలేదు. ఇదే బంకులో పెట్రోలు పరిమాణం తెలుసుకోవడానికి ఖాళీ బాటిల్‌లో పెట్రోలు నింపుకుని, వాటర్ బాటిల్ పరిమాణంతో తనిఖీ చేస్తే తేడా కనిపిస్తోంది. మీటరు రీడింగు సున్నా ఉన్నప్పటికీ ఒకేసారి రూ.4 జంప్ అవుతోంది.



చిత్తూరులోని ఓ బంకులో పెట్రోలు, నీళ్ల బాటిల్ మధ్య తేడా ఉన్న పరిమాణం

వసతులు కనిపిస్తే ఒట్టు..

మరోవైపు వాహనాలకు ఉచిత గాలి నింపేందుకు బంకుల్లో పరికరాలు తప్పనిసరిగా ఉండాలి. బంకులు కొత్తగా ఏర్పాటు చేసేప్పుడు కనిపించే ఈ పరికరాలు ఆపై తుప్పుపట్టి ఉంటున్నాయి. గాలి పట్టడానికి వెళితే పనిచేయడం లేదని సిబ్బంది చెబుతున్నారు. అత్యవసర వేళ కాలకృత్యం తీర్చుకోవడానికి వాష్‌రూమ్ తప్పనిసరిగా ఉండాలి. జిల్లాలోని 38 బంకుల్లో వాష్‌రూమ్‌లు లేవు. 42 బంకుల్లో వాష్‌రూమ్‌ల్లో నీళ్ల లేవని, రిపేర్లలో ఉన్నాయని నిర్వాహకులు లోపలకు వెళ్లనీయడంలేదు. ఎక్కువ పరిమాణంలో పెట్రోలును క్యాన్లలో నింపుకుంటున్న విక్రయదారులు, వాటిని పల్లెల్లోకి తీసుకెళ్లి.. కిరోసిన్‌ను కలిపి విక్రయిస్తున్నారు.

అధికారులెక్కడ..?

పెట్రోలు ఫిల్లింగ్ స్టేషన్లను తనిఖీ చేయాల్సిన పౌరసరఫరాల అధికారులు, తూనికలు–కొలతల శాఖ అధికారులు ఏమాత్రం వినియోగదారుల సమస్యలు పట్టించుకోవడంలేదు. చిత్తూరు నగరంలోని పుత్తూరు రోడ్డులో ఓ బంకులో ఎలక్ట్రానిక్ చిప్‌ను అమర్చి, పెట్రోలు పరిమాణంలో భారీ తేడాలతో దోచుకుంటుంటే ఐదేళ్ల కిందట చేసిన తనిఖీలు తప్ప.. మరేవీ ప్రజలకు గుర్తు లేదు. కొన్నిచోట్ల నిర్వాహకుల నుంచి నెలసరి మామూళ్లు, ప్రభుత్వ కార్యక్రమాలకు కుర్చీలు వేయడం, టీ–బిస్కెట్లు ఇవ్వడం లాంటి పనులకు వీళ్లను ఉపయోగించుకుంటున్న అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

జిల్లాలో పెట్రోలు బంకుల వివరాలు	
పెట్రోలు బంకుల సంఖ్య:	170
పెట్రోలు అమ్మకాలు (నెలకు):	30 లక్షల లీటర్లు
డీజిల్ (నెలకు):	30.28 లక్షల లీటర్లు
లావాదేవీలు(నెలకు):	రూ.30.02 కోట్లు
ఫిల్టర్ పేపర్లు లేనివి:	67 బంకులు
వాష్‌రూమ్‌లు లేనివి:	38 బంకులు
వాష్‌రూమ్‌లు రిపేర్లు:	42 బంకులు
గాలి నింపే మిషన్లు రిపేర్లు:	89

చర్యలు తప్పవు..

పెట్రోలు ఫిల్లింగ్ స్టేషన్లలో ఏటా తనిఖీలు చేసి, ఎక్కడైనా తేడాలు కనిపిస్తే చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా ఇబ్బందులుంటే మాకు ఫిర్యాదు (ఫోన్–8008301423)చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. – శంకరన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, చిత్తూరు.

నోటీస్ బోర్డు

నేడు ఇఫ్తార్ విందు

చిత్తూరు కలెక్టరేట్ : రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీన ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారికంగా కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు చిత్తూరులోని ఉర్దూ షాదీమహల్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు పాల్గొనాలని ఆయన కోరారు.

28న ఉగాది పురస్కారాల ప్రదానం

చిత్తూరు కలెక్టరేట్ : వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి ఈ నెల 28వ తేదీన ఉగాది పురస్కారాలు అందజేయనున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు వెల్లడించారు.సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉగాది పండుగను పురస్కరించుకుని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో పురస్కారాలు అందిస్తామన్నారు. పలమనేరులోని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరంలో నిర్వహించే కార్యక్రమానికి తెలుగుభాషాభిమానులు విచ్చేయాలని కోరారు.

26 నుంచి నారా భువనేశ్వరి కుప్పం పర్యటన

కుప్పం: ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఈ నెల 26వ తేదీ నుంచి కుప్పంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ తెలిపారు. 26 నుంచి 29వ తేదీ వరకు గుడుపల్లి, కుప్పం, రామకుప్పం మండలాల్లో ఆమె పర్యటన సాగుతుందని తెలిపారు. ఈ పర్యటనకు పార్టీ శ్రేణులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కార్మికులు జాగ్రత్తలు పాటించాలి

చిత్తూరు కార్పొరేషన్: ఎండ తీవ్రతకు గురి కాకుండా కార్మికులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చిత్తూరు, తిరుపతి జిల్లాల ఉపకార్మిక కమిషనర్ ఓంకార్‌రావు కోరారు. కార్మికుల రక్షణ కోసం పారిశ్రామిక యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తలపై టోపీ పెట్టుకోవడం, తెలుపు రంగు గల పలుచటి కాటన్ వస్త్రం ధరించడం, ఉప్పు కలిపిన మజ్జిగ తీసుకోవడం, మంచి నీళ్లు ఎక్కువ సార్లు తాగడంపై కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కార్మికులను బ్యాంకు, ఇతర పనుల మీద బయటకు పంపకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎన్.వి.రమణకు సన్మానం

కుప్పం: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణను కుప్పం బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. సోమవారం ఓ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన కుప్పం కోర్టు ప్రాంగణాన్ని సందర్శించారు. జూనియర్ న్యాయవాదులు న్యాయ వ్యవస్థ పటిష్టతకు పాటు పడాలని సూచించారు. ప్రస్తుతం కోర్టు భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నూతన భవనం నిర్మాణం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ, జూనియర్ సివిల్ జడ్జి వరుణ్ తేజ్, బార్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



ఎన్.వి.రమణను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

నాకు ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి

రొంపిచెర్ల: అధికార పార్టీ నాయకుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని బాధితుడు జిల్లా కలెక్టర్, ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితుని కథనం.. మండలంలోని గానుగచింత పంచాయతీ ఓబులవారిపల్లెకు చెందిన ఉమాపతిరెడ్డి గ్రామంలో అధికార పార్టీకి చెందిన కొందరితో గడ్డి పందిరి విషయమై వివాదం నడుస్తోంది. వందేళ్లుగా గడ్డి పందిరి ఉమాపతిరెడ్డి కుటుంబం అనుభవంలో ఉంది. అయితే పార్టీ ముసుగులో కొందరు పందిరిని కూల్చి వేయడానికి ప్రయత్నిస్తున్నారని, సర్వే నంబరు 128–2, 129లలో గ్రామంలో అందరికీ భాగాల ఉన్నాయని, కొలతలు వేసి వారికి వస్తే తీసుకోమని చెప్పినా పట్టించుకోకుండా దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ నాయకుల నుంచి ప్రాణహాని ఉందని ఉన్నతాధికారులను ఆశ్రయించి తన గోడు నివేదించాడు.



వివాదాస్పద ఉమాపతి గడ్డి పందిరి

హుండీ లెక్కింపుపై విచారణ

– టెంపుల్ ఇన్‌స్పెక్టర్, ఈఓలపై భక్తుల ఫిర్యాదు

– విచారణ చేపట్టిన అసిస్టెంట్ కమిషనర్

పుత్తూరు: స్థానిక శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర స్వామి, ఆరేటమ్మ ఆలయాల్లో చేపట్టిన హుండీలోని కానుకల లెక్కింపులో దేవదాయశాఖ అధికారులు చేతివాటం చూపారన్న ఫిర్యాదుపై చిత్తూరు జిల్లా దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. సదాశివేశ్వరాలయంలోని హుండీల్లో భక్తులు గత ఏడాది జనవరి 3వ తేదీ నుంచి జూన్ 15 వరకు సమర్పించిన కానుకల ద్వారా రూ.3,41 లక్షల ఆదాయం వచ్చింది. శనివారం నిర్వహించిన 9 నెలల్లో భక్తులు హుండీలో వేసిన కానుకల లెక్కింపులో రూ.2 లక్షలే వచ్చిందని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుమన ప్రియ, ఈఓ జయక్రిష్ణ నిర్ధారించారు. దీనిపై ఏసీ రామకృష్ణారెడ్డి లెక్కింపులో పాల్గొన్న వారి నుంచి స్టేట్‌మెంట్లను రికార్డు చేసుకున్నారు. అలాగే ఫిర్యాదు చేసిన వారు రెండవ దఫా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడం గమనార్హం. ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి చేతివాటం ప్రదర్శించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



విచారణ నిర్వహిస్తున్న ఏసీ రామకృష్ణారెడ్డి

గంజాయి విక్రేతల అరెస్టు

నగరి: మండలంలోని వీకేఆర్‌పురం గ్రామం వద్ద నగరి–తిరుత్తణి మెయిన్ రోడ్డు సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. డీఎస్పీ మహమ్మద్ సయ్యద్ అజీజ్ తెలిపిన కథనం మేరకు.. సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘాలో భాగంగా సోమవారం ఉదయం సీఐ విక్రమ్‌కు రహస్య సమాచారం అందింది. దీనిపై స్పందించిన ఆయన డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది, పోలీసులతో కలసి వీకేఆర్‌పురం గ్రామంలో దాడులు చేశారు. తమిళనాడు నుంచి వచ్చి వీకేఆర్ పురంలో స్థిరనివాసం ఏర్పరుచుకున్న ఎ.అబ్బాస్ (39), మండలంలోని ఓజీ కుప్పం గ్రామానికి చెందిన ఓ.మోహన్ (30) నగరి–తిరుత్తణి మెయిన్ రోడ్డు సమీపంలో గంజాయి విక్రయిస్తుండగా అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.32 వేలు విలువచేసే 2.35 కిలోల గంజాయిని, ఒక మోటార్ సైకిల్‌ను, మొబైఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరితో పాటు గంజాయి విక్రయిస్తున్న మరో ఇద్దరు పరారయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మహమ్మద్ సయ్యద్ అజీజ్ మాట్లాడుతూ నగరి సరిహద్దు ప్రాంతం కావడంతో గంజాయి అక్రమ రవాణా, అమ్మడం, కొనడం, సేవించడం పైన ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చూపిన సిబ్బంది ఇంద్ర కుమార్, గోపి, గజేంద్ర, రమేష్, పవన్ కళ్యాణ్‌లను అభినందించారు.



నిందితులతో డీఎస్పీ, సీఐ, పోలీసులు

నూతన కార్యవర్గం

చిత్తూరు అర్బన్: నగరంలో సోమవారం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ వెల్ఫేర్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. రెండు ప్యానెళ్ల నుంచి సభ్యులు పోటీ పడగా జిల్లా నూతన అధ్యక్షుడిగా రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్ ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా హరిప్రసాద్, జయశంకర్, అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రతాప్, కార్యనిర్వహణ కార్యదర్శిగా భారతిరాజా, సహాయ కార్యదర్శులుగా సురేంద్రబాబు, శ్రావణి, ప్రెస్ కార్యదర్శులుగా రమేష్, నాగరాజు, లక్ష్మి, నాగరాజు, సభ్యులుగా బోసుకుమార్, విజయ్‌కుమారల్ ఎన్నికయ్యారు.



నూతనకార్యవర్గాన్ని అభినందిస్తున్న ప్రముఖులు

కుక్కల దాడిలో జింకకు గాయాలు

గుడిపాల: కుక్కల దాడిలో జింకకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. బట్టువాళ్లూరు గ్రామం సమీపంలో కుక్కలు సోమవారం ఉదయం అటవీమార్గం నుంచి వస్తున్న జింకను వెంబడించి, దాడి చేశాయి. దీంతో జింకకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి, దాన్ని కాపాడి అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. అటవీ బీట్‌ఆఫీసర్ ఢిల్లీరాణి, అరుణ సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన జింకను స్థానిక పశువైద్యశాలకు తరలించారు. డాక్టర్ సాయిసుధ జింకకు చికిత్స చేశారు. కాళ్లకు తీవ్రంగా గాయం కావడంతో కాళ్లను తీసివేశారు. అనంతరం చిత్తూరు డియర్‌పార్క్‌కు తరలించి అబ్జర్వేషన్‌లో ఉంచడం జరుగుతుందని వారు తెలిపారు.



దాడిలో తీవ్రంగా గాయపడిన జింక

వైద్యమిత్రలపై అలసత్వం తగదు

– కలెక్టరేట్ ఎదుట నిరసన



నిరసన ర్యాలీ చేస్తున్న వైద్యమిత్రలు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి సర్కారు వైద్యమిత్రపై అలసత్వం తగదని, వారికి కనీస వేతనాలు ఇవ్వకపోవడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు, వైద్యమిత్ర అసోసియేషన్ జిల్లా కార్యదర్శి లత ఆరోపించారు. ఆ సంఘం నాయకులు, వైద్య మిత్రలు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని వైద్య మిత్రలకు కనీస వేతనాలు, ఉపాధి భద్రత కల్పించకపోవడం అన్యాయమన్నారు. గత 17 సంవత్సరాల సర్వీసుని పరిగణలోకి తీసుకుని కాంట్రాక్టు ఉద్యోగులుగా పరిగణించాలన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్న సమయంలో వైద్య మిత్రలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగి మృతి చెందిన కుటుంబాలకు రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగంలో సర్వీసు వెయిటేజీ కల్పించాలని కోరారు. వైద్య సేవ సిబ్బందికి అంతర్గత ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశార. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 27 చలో గుంటూరు కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మెలో పాల్గొంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య మిత్ర లు పాల్గొన్నారు.

అయ్యా..స్పందించండి!

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు
- వివిధ సమస్యలపై 299 అర్జీలు
- స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : 'అయ్యా..చాలా దూరం నుంచి ప్రతివారం కలెక్టరేట్‌కు వస్తున్నాం .. మా సమస్యలు పరిష్కరించండి'.అంటూ ప్రజలు అధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు అధికారులకు అర్జీలు అందజేశారు. అన్ని శాఖలకు సంబంధించి 299 అర్జీలు నమోదుకాగా రెవెన్యూ శాఖకు మాత్రం 247 అర్జీలు వచ్చాయి. ప్రతివారం అధిక శాతం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు నమోదవుతున్నాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



ప్రజల అర్జీలను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

సర్వే చేయించి..న్యాయం చేయండి

దొంగపట్టాలు చేయించుకున్నారని పరిశీలించి రికార్డుల్లో పేర్లు తొలగించాలని పెనుమూరు మండలం పులికల్లు హరిజనవాడ గ్రామస్తులు అశ్విని, తులసి, మునెమ్మ కోరారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. తమ పూర్వీకుల కాలం నుంచి తమ గ్రామంలోని సర్వే నంబర్ 1196,1197లో 44 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఆ భూమిని ప్రభాకరన్ అనే వ్యక్తి ఆక్రమించుకుని దొంగ పట్టాలు చేయించుకున్నారన్నారు. రెవెన్యూ రికార్డుల్లో కుటుంబసభ్యుల పేర్లతో వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమస్యపై గత కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా విచారణ చేయించి ప్రభాకరన్ ఆ భూమిలోకి రానివ్వకుండా చేశారన్నారు. అదే భూమిని ప్రస్తుతం పులికల్లు హరిజనవాడకు చెందిన హరి అనే వ్యక్తి ప్రభాకరన్ ద్వారా పట్టాలు పొందినట్లు దౌర్జన్యం చేస్తున్నారని చెప్పారు.

శ్మశానవాటిక ఆక్రమించుకున్నారు

తమ గ్రామంలోని శ్మశానవాటిక స్థలాన్ని అగ్రకులస్తులు ఆక్రమించుకున్నారని వెదురుకుప్పం మండలం శ్రీనివాసపురం గ్రామస్తులు యుగంధర్, నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వారు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని శ్మశానస్థలాన్ని అగ్రకులస్తులు ఆక్రమించుకున్నారని చెప్పారు. ప్రశ్నించినందుకు దాడులకు పాల్పడుతున్నట్లు వాపోయారు. మండల అధికారులకు తమ సమస్యను ఎన్నిసార్లు విన్నవించుకున్నా న్యాయం చేయడంలేదని తెలిపారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.



అప్‌డేట్ కోసం వెళితే పేరునే మార్చేశారు



ఆధార్‌కార్డులో అప్‌డేట్ కోసం వెళితే పాప పేరునే మార్చేశారని బాధిత విద్యార్థిని పూర్ణిమ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సమస్య పరిష్కారించాలని బాలిక, కుటుంబసభ్యులు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. విద్యార్థిని పూర్ణిమ మాట్లాడుతూ తాను చిత్తూరు నగరంలోని గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల ఆధార్ అప్‌డేట్ కోసం సచివాలయానికి వెళ్లగా అక్కడ పూర్ణిమకు బదులు సౌందర్య అని పేరు మార్చేశారన్నారు. సమస్య పరిష్కరించాలని సచివాలయంలో పలు మార్లు సంప్రదించినా న్యాయం చేయలేదని తెలిపారు.

ఎన్నిసార్లు అర్జీ ఇచ్చినా ఇళ్లు ఇవ్వలేదు

ఎన్నిసార్లు అర్జీ ఇచ్చినా సొంతిళ్లు మంజూరు చేయడం లేదని పెనుమూరు మండలం విజయనగరం ఎస్టీ కాలనీకి చెందిన కళ్యాణి, గౌరి, యామని తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో తమ సమస్యను వెల్లడించారు. తమకు సొంతిళ్లు లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. సొంతిళ్లు మంజూరు చేయాలని మండల అధికారులకు ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. న్యాయం చేయాలని కోరారు.